సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 524 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.5
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 పలికింది.



జిల్లాలో బుధవారం సూర్యప్రతాపం పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను నమోదయ్యాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

పత్రాలు సమర్పిస్తే పరిహారమిస్తాం

- జాయింట్ కలెక్టర్ చేతన్



రైతులతో సమావేశమైన జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: నేషనల్ హైవే-544ఈ కోసం భూములు కోల్పోయిన రైతులు తగిన పత్రాలు సమర్పిస్తే వెంటనే నష్ట పరిహారం అందజేస్తామని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కొడికొండ-మడకశిర-శిర వరకూ నేషనల్ హైవే-544ఈ ఏర్పాటులో భాగంగా అధికారులు మడకశిర, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి మండలాలకు చెందిన 152 మంది రైతుల భూములు సేకరించారు. అయితే సదరు రైతులు ఇప్పటికీ సరైన పత్రాలు సమర్పించకపోవడంతో పరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో జేసీ చేతన్ బుధవారం భూ నిర్వాసిత రైతులను కలెక్టరేట్‌కు పిలిపించి వారితో మాట్లాడారు. జాతీయ రహదారుల చట్టం-1956 మేరకు భూమిని సేకరించామన్నారు. పరిహారం ఇచ్చేందుకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ఎవరూ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా రైతులు బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తం జిరాక్సులను వెంటనే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. లేకపోతే పరిహారం సొమ్ము కోర్టులో జమ చేస్తామని వెల్లడించారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఇంటర్న్‌షిప్ 'స్పాట్'



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం (స్పాట్) నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్కేయూలో వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు వచ్చాయన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి అని అన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సంబంధించి మొత్తం 200 మార్కులు కేటాయించగా, తక్కిన 150 మార్కుల్లో 100 మార్కులు ప్రాజెక్ట్ వర్క్‌కు, 50 మార్కులు వైవా వాయిస్‌కు కేటాయించామన్నారు. అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం నిర్వహించాలన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం నిర్వహించే అంశంపై వచ్చే ఏడాది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇంటర్న్‌షిప్ మూల్యాంకనానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌లో రెండు, నాలుగు, ఐదు, ఆరో సెమిస్టర్ థియరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

23న 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష



అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 23న కురుగుంట గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, ఇంటర్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

తొలగుతున్న 'చుక్కలు'

- పుట్టపర్తి మండలం కప్పలబండ పొలంలో కడియాల గోపాల్‌కు 10 ఎకరాలు భూమి ఉండేది. కానీ అది చుక్కల భూముల జాబితాలో చేరడంతో సంపూర్ణ హక్కులు ఉండేవి కావు. అన్ని ఆధారాలతో సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదు. ఆరు నెలల క్రితం డీఎల్‌సీలో అన్ని పరిశీలించిన అధికారులు 10 ఎకరాలను క్రమబద్ధీకరించారు.
- పుట్టపర్తి మండలం పెడపల్లికి చెందిన గంగాద్రికి 5.25 ఎకరాల భూమి ఉండేది. అది చుక్కల భూముల జాబితాలో ఉండటంతో అత్యవసరంలో ఉపయోగపడేది కాదు. దీంతో గంగాద్రి దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్నాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. కానీ ఇటీవలే గంగాద్రి పొలాన్ని చుక్కల భూముల జాబితాలోనుంచి తొలగించి సంపూర్ణ హక్కులు కల్పించారు.

...ఇలా జిల్లాలో చుక్కల భూముల చిక్కులు తొలగిపోతున్నాయి. రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగన్ సర్కార్ ఏళ్ల తరబడి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతోంది. దీంతో రైతుల ఇంట ఆనందం వికసిస్తోంది.



రెవెన్యూ డివిజన్	చుక్కల భూములు (ఎకరాల్లో)	చుక్కలు తొలగిన భూములు (ఎకరాల్లో)
ధర్మవరం	5,259.58	3,165.95
కదిరి	14,568.50	11,402.27
పుట్టపర్తి	5,821.54	2,674.55
పెనుకొండ	11,478.69	4,767.79
మొత్తం	37,128.31	22,010.56

- చుక్కల భూములకు పరిష్కారం
- దశాబ్దాల రైతుల కల సాకారం
- అన్నీ సవ్యంగా ఉన్న వాటికి ఆమోదముద్ర
- జిల్లాలో 22 వేల ఎకరాలకు విముక్తి

పుట్టపర్తి అర్బన్: చుక్కల భూముల (డాటెడ్ ల్యాండ్స్) ఫైళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మోక్షం కలిగిస్తోంది. నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉన్న వాటికి 'డాటెడ్ ల్యాండ్-2017' చట్టం జాబితా నుంచి తొలగిస్తూ జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ) సమావేశంలో ఆమోద ముద్ర వేస్తోంది. ఇలా గడచిన నాలుగేళ్లలోనే ఏకంగా 22 వేల ఎకరాలకు విముక్తి కలిగించింది.

చుక్కల భూములు ఎలా వచ్చాయంటే..
బ్రిటీష్ కాలంలో భూములకు పన్ను వసూలు చేసే విధానం ఉండేది. అప్పట్లో ట్యాక్స్ కట్టిన రైతుల భూములను మాత్రం సదరు రైతుపేరుతో రికార్డుల్లో నమోదు చేశారు. పన్ను చెల్లించని భూములకు రైతుల పేర్ల స్థానంలో చుక్కలు పెట్టి వదిలేశారు. వాటిని చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్స్)గా వ్యవహరిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ సదరు రైతులు తరాలుగా భూములు సాగుచేసుకుంటూ వస్తున్నారు. కానీ సంపూర్ణ హక్కులు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వాలు చుక్కల భూములపై దృష్టి సారించకపోవడంతో రైతులకు చిక్కులు తప్పలేదు.

క్రమబద్ధీకరణకు జగన్ సర్కార్ చర్యలు..
ఆర్‌ఓఆర్‌లో చుక్కలు పెట్టి వదిలేసిన భూములను దాదాపుగా ప్రభుత్వ భూమిగా పరిగణిస్తూ వస్తున్నారు. ఇలా పరిగణించిన భూమిని ప్రభుత్వం అప్పుడప్పుడూ భూమి లేని రైతులకు పంపిణీ చేయడం, లేదా ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడం జరిగేది. దీంతో సాగులో ఉన్న రైతులకు తీవ్ర అన్యాయం జరిగేది. ఈక్రమంలోనే 2017లో డాటెడ్ ల్యాండ్ చట్టం అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం 'చుక్కల' జాబితాలో ఉన్న భూములు సాగు చేసుకుంటున్న రైతులు సరైన ఆధారాలు సమర్పిస్తే వాటిని క్రమబద్ధీకరించే అవకాశం కలిగింది. కానీ అప్పటి ప్రభుత్వాలు రైతుల సమస్యలపై పెద్దగా పట్టించుకోలేదు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రైతులకూ అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించారు. అన్నీ సవ్యంగా ఉన్న వాటికి ఆమోదం తెలిపి రైతుకు పట్టాచేసి ఇస్తున్నారు.

ఆమోద ముద్రకు నిబంధనలిలా...
చుక్కల భూముల జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం డీఎల్‌సీ ఆమోద ముద్ర వేస్తుంది. సాగు చేస్తున్నట్లుగా చెప్పే ప్రభుత్వ భూమి వివరం ఆర్ఎస్ఆర్‌లో చుక్కలుగా ఉండాలి. ఆ భూమి ఎవరి పేరునా అసైన్డ్ చేసి ఉండకూడదు. డాటెడ్ ల్యాండ్ చట్టం-2017 ప్రకారం... ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న వ్యక్తి చట్టం వచ్చే నాటికి 12 ఏళ్ల ముందు ఆ భూమిపై హక్కు, అనుభవం కలిగి ఉండాలి. చట్టం నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న వారు తహసీల్దారు వద్ద దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి ఆర్డీఓకు తహసీల్దార్ నివేదిస్తారు. దానిని ఆర్డీఓ విచారణ నిర్వహించి కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ)లో వాటిని విచారణ చేసి నిబంధనల ప్రకారం అన్నీ సక్రమంగా ఉన్నవాటికి జాబితా నుంచి తొలగిస్తూ అమోద ముద్ర వేస్తారు.

జిల్లాలో చుక్కల భూములు ఇలా..
జిల్లాలో 32 మండలాలుండగా, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఇందులో 37,128.31 ఎకరాలు చుక్కల భూముల జాబితాలో ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 22,010.56 ఎకరాల భూమిని అధికారులు క్రమబద్ధీకరించారు.

దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం



చుక్కల భూములున్న రైతులు అన్ని వివరాలు, సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే కమిటీ పరిశీలించి ఆమోదం తెలుపుతుంది. అప్పుడు రైతుకు ఆ భూమిపై సర్వహక్కులూ లభిస్తాయి. తద్వారా భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు, విక్రయించుకోవచ్చు. ఇప్పటి వరకూ జిల్లాలో సుమారు 22 వేల ఎకరాల భూములను చుక్కల పరిధిలోంచి తొలగించాం. ఈ నెలాఖరున మరోసారి డీఎల్‌సీ సమావేశం కానుంది.
– కొండయ్య, డీఆర్‌ఓ

సైనిక్ కాలనీల్లో తక్కువ ధరకే ఇళ్ల స్థలాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాజీ సైనికులు, కుటుంబంలోని వితంతువులకు ప్రభుత్వ ధరకే 175 చదరపు గజాల విస్తీర్ణంతో ఇళ్ల స్థలాలను తక్కువ ధరకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సైనిక్ కాలనీలు ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు సైనిక్ సంచాలకుల నుంచి ఆదేశాలు అందాయని ఉమ్మడి అనంతపురం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ఆసక్తి కలిగిన మాజీ సైనిక కుటుంబాల వారు ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ ప్రాజెక్టుల పరిధిలోని 8 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2 మినీ కార్యకర్తలు, 47 సహాయకుల పోస్టులకు ఈ నెల 4వ తేదీన అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. 12వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించగా, 71 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ బుధవారం కదిరి, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఆయా డివిజన్ల ఆర్డీఓలు, ఐసీడీఎస్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పుట్టపర్తిలో పీడీ లక్ష్మీకుమారి, ఆర్డీఓ భాగ్యరేఖ, అసిస్టెంట్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నివేదిత, సీడీపీఓలు గాయత్రి, వరలక్ష్మి తదితరులు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఇంటర్వ్యూలు పూర్తి చేశారు.

పాముకాటుతో బాలుడి మృతి



పాముకాటుతో మృతి చెందిన మదన్‌కుమార్



కుళాయి వద్ద నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపు

- ఆస్పత్రి బయట ఆడుకుంటుండగా కాటేసిన పాము
- చికిత్స పొందుతూ బాలుడి మృతి

తనకల్లు: స్థానిక 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మదన్‌కుమార్ (4) అనే బాలుడు పాము కాటుకు గురై మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లచెరువు ఎస్సీ కాలనీకి చెందిన శంకర్ రెండు రోజుల క్రితం తన భార్య సుమిత్రను కాన్పు కోసం తనకల్లులోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాడు. బుధవారం ఉదయం తన భార్యను చూసేందుకు శంకర్ తన నాలుగేళ్ల కుమారుడైన మదన్‌కుమార్‌ను తీసుకొని ఆస్పత్రికి వచ్చాడు. భార్య సుమిత్రతో మాట్లాడిన అనంతరం కుమారుడితో కలిసి ఆస్పత్రి బయటకు వచ్చి బంధువులతో మాట్లాడుతుండగా, మదన్‌కుమార్ ఆడుకుంటూ కొళాయి వద్దకు వెళ్లాడు. నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లోకి చెయ్యి పెట్టాడు. ఆ పైప్‌లో ఉన్న నాగుపాము బాలుడి చేతిపై కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. నోటి నుంచి నురగ వస్తుండటంతో పాముకాటు వేసినట్లు గుర్తించిన వైద్యులు బాలుడి ప్రాణాలు కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో మదన్‌కుమార్ మృతి చెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు పాముకాటుతో కళ్లముందే ప్రాణాలు వదలడంతో శంకర్, సుమిత్ర దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాంభూపాల్, ఏఎస్ఐ నరసింహులు ఆస్పత్రి వద్దకు వచ్చి బాలుడి మృతిపై విచారణ చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

మరమగ్గంపై 45 శాతం రేషం దాటకూడదు

- చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు



పవర్‌లూమ్స్‌లో తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ధర్మవరం రూరల్: చేనేత రిజర్వేషన్ రకాలను మరమగ్గాలపై తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజి తెలిపారు. బుధవారం వారు సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు పవర్‌లూమ్స్‌పై దాడులు నిర్వహించారు. కేశవనగర్‌లోని గుండా మహేష్ పవర్ లూమ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. మరమగ్గంపై తయారు చేస్తున్న చీరలను పరిశీలించారు. చేనేత రకాలను తయారు చేస్తున్నారన్న అనుమానంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. యాజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. మరమగ్గాలపై 45 శాతం రేషం ఉపయోగించవచ్చునన్నారు. 45 శాతం రేషం దాటితే చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించినట్లేనన్నారు. ఇక నుంచి రెగ్యులర్‌గా దాడులను నిర్వహిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు
కొత్తచెరువు: చేనేత రిజర్వేషన్‌చట్టం- 1985 ద్వారా చేనేతలకోసం రిజర్వు చేసిన 11 రకాల చీరలను పవర్‌లూమ్స్‌పై తయారుచేస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమగ్గాలు నడుపుతున్న కార్మికులు మగ్గాలపై 45 శాతం కంటే ఎక్కువ పట్టును ఉపయోగించి చీరలు తయారు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 18న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ధర్మవరంలో చింతా దిలీప్‌కు చెందిన మగ్గాన్ని సీజ్ చేశారన్నారు. ప్రతి చేనేత కార్మికులు విషయాన్ని గమనించి చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించరాదని సూచించారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తే కఠిన చర్యలు

ప్రశాంతి నిలయం: ఇంటర్ బోర్డు నుంచి ఆదేశాల రాకమునుపే అడ్మిషన్లు చేపట్టే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. అందువల్ల బోర్డు నుంచి ఉత్తర్వులు వెలువడిన తర్వాతే ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాల్సి ఉందన్నారు. బోర్డు నిబంధనలు ఉల్లంఘించి అడ్మిషన్లు చేపట్టే కళాశాలలపై భారీ జరిమానా విధించడంతోపాటు, కళాశాల గుర్తింపు రద్దుకు బోర్డుకు సిఫార్సు చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలలు ఇచ్చే ప్రకటనలు చూసి మోసపోకూడదన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు
- పలు ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రజాసేవలకే.. అందువల్ల ప్రతి అధికారీ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన పుట్టపర్తిలోని పలు ప్రభుత్వ జిల్లా కార్యాలయాలను తనిఖీ చేసి ఆయా శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రశాంతి గ్రామంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, పశుసంవర్ధకశాఖ, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం, ఐసీడీఎస్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, భూగర్భ జల వనరుల శాఖలను తనిఖీ చేశారు. కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అధికారీ అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం ఆయన ఆర్డీఓ ,తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. రెవెన్యూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. అనుమతి లేకుండా ఉద్యోగులెవరూ పనివేళల్లో బయటకు వెళ్లకూడదన్నారు. ఇందుకు ఆయా శాఖల జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి సుభదాస్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, భూగర్భ జల వనరుల శాఖ అధికారి రాజశేఖరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఆర్డీఓ భాగ్యరేఖ, తదితరులు ఉన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లపై విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రశాంతి నిలయం: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'స్పాట్'లో తొలిరోజు 688 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు కేంద్రానికి చేరుకున్న ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షికి రిపోర్టు చేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభించారు. తొలిరోజు అన్ని సబ్జెక్టులు కలిపి 10,652 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేశారు. మూల్యాంకన జిల్లా పరిశీలకుడు, ఆర్‌డీజీ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షించారు.

కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అరుణ్ బాబు
పదో తరగతి 'స్పాట్' విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షిని అదేశించారు. బుధవారం ఆయన కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని మూల్యాంక కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు విధుల్లో ఉన్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకూ నిరంతరం పర్యవేక్షిస్తుండాలని డీఈఓకు సూచించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా ఉప విద్యాధికారి రంగస్వామి, ఏడీఈ నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఏ-2 పరీక్షలు..
జిల్లా వ్యాప్తంగా అన్ని యజమాన్య కింద పనిచేసే పాఠశాలల్లోని ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు గురువారం నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎండలు పెరిగిన దృష్ట్యా పరీక్ష సమయంలోనూ అధికారులు మార్పులు చేశారు. 1 నుంచి 8 తరగతులకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, 9వ తరగతి పరీక్షలు ఉదయం 8 నుంచి 11.15 గంటల వరకు నిర్వహించనున్నారు. 6 నుంచి 9 తరగతుల పరీక్ష పత్రాన్ని ఈసారి డీసీఈబీ రూపొందించింది. అలాగే 9వ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది నుంచే పదో తరగతి నమూనాలో 6 పేపర్లు 100 మార్కులకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణపై డీఈఓ మీనాక్షి, డీసీఈబీ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి ఆయా మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎంపీ మాధవ్



ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

కొత్తచెరువు: జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డిని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించారు. అనంతరం ఎస్పీని సన్మానించారు.

జలకళ బోర్లపై ప్రభుత్వ ఆడిటింగ్



బత్తలపల్లి వద్ద బోరు లోతును పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జలకళ పథకంలో భాగంగా రైతులు ఏర్పాటు చేసుకున్న బోర్లకు సంబంధించి ఆడిటింగ్ ప్రక్రియ మొదలైంది. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 1,592 మంది రైతులు బోర్లు వేయించుకున్నారు. వీటి కోసం జియాలజిస్టులను ప్రభుత్వం రంగంలో దించి నీటి జాడలను గుర్తించి బోర్లను ఉచితంగా వేయించింది. బోరు లోతు ఎంత? కేసింగ్ పైపు ఎంత వాడారు? నీళ్లు ఎంత లోతులో ఉన్నాయి? సాగుభూమి అవునా? కాదా? విద్యుత్ సౌకర్యం ఎంత దూరంలో ఉంది? అనే అంశాపై అధికారులు ఆడిటింగ్ చేపట్టారు. ఇందు కోసం ఆరు బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి. ఆడిటింగ్ పూర్తి కాగానే విద్యుత్ సమకూర్చుకున్న వారికి మోటార్లు అమర్చే కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి

అనంతపురం సిటీ: మండలాలు, పంచాయతీల్లో ఆదాయ వనరులపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశించారు. డీఎల్‌డీఓలు చిలంకూరు ఓబుళమ్మ (అనంతపురం), సూర్యనారాయణ(కదిరి), శంకర్ (కళ్యాణదుర్గం), శివారెడ్డి (ధర్మవరం)తో పాటు 63 మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో టెలీకాన్ఫరెన్స్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పక్కన డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఉన్నారు. .జిల్లా పరిషత్, మండల పరిషత్ ఆస్తులతో పాటు ఆడిట్, ఎన్నికలు వంటి కీలక అంశాలపై చర్చించారు.

సంతృప్తికరమైన సేవలు అందాలి

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందజేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి సీఎం కార్యాలయ కార్యదర్శి నారాయణ భరత్ గుప్తతో కలసి స్పందన కార్యక్రమంపై వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్వో కొండయ్య, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పూనం మాలకొండయ్య మాట్లాడుతూ... నవరత్నాలు పథకం అమలుపై ఆరా తీశారు. స్పందన కార్యక్రమాల్లో ప్రజలు అందజేస్తున్న అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలను చూపడం ద్వారా ప్రభుత్వంపై వారిలో విశ్వాసం పెంపొందుతుందన్నారు. స్పందన సమస్యల పరిష్కారంపై రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేసిన తర్వాత రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి/ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్/పట్టణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం తదితర 5 శాఖలకు సంబంధించిన అర్జీలు తరచూ ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించామన్నారు. రెవెన్యూ, రైతుభరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గృహ నిర్మాణం తదితరాల్లో తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందజేసే అర్జీలు, పరిష్కారాలకు సంబంధించి పర్యవేక్షణకు జిల్లాకు ఓ ప్రత్యేక అధికారిని నియమించామని, త్వరలో ఆ అధికారులు జిల్లాల పర్యటన చేపట్టనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదు

- పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్

అనంతపురం సిటీ: రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదని పంచాయతీ రాజ్ ఇంజినీర్లను ఆ శాఖ ఎస్ఈ భాగ్యరాజ్ ఆదేశించారు. అనంతపురంలోని పీఆర్ జిల్లా కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐఐబీ, పీఆర్, రూరల్ రోడ్స్ స్కీంల కింద ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.268 కోట్లతో 138 రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో ఇప్పటికే 10 రోడ్లు పూర్తి కాగా, 128 రోడ్లు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. అందుకు రూ.64.43 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ కింద రూ.35.43 కోట్లతో 65 రోడ్లు మంజూరు కాగా, ఇప్పటికే రూ.7.86 కోట్లతో 16 రోడ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన రోడ్ల నిర్మాణాలను వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం(పీఎంజీఎస్‌వై) కింద రూ.70.62 కోట్లతో 2 పనులు మంజూరు కాగా, రూ.56.36 కోట్ల ఖర్చుతో 15 రోడ్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. రహదారుల నిర్మాణాల్లో నాణ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కేవీకేవీ ప్రసాద్ (అనంతపురం), డీఎల్ శ్రీనివాసులు (శ్రీసత్యసాయి జిల్లా), డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జడ్జీల బదిలీలు

అనంతపురం: జిల్లా జడ్జిల బదిలీలు జరిగాయి. అనంతపురం ఫ్యామిలీ కోర్టు -7 అడిషనల్ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి డి.తిరుమలరావును గుంటూరు లేబర్ కోర్టు, చైర్మన్ ఇండస్ట్రీయల్ ట్రిబ్యునల్‌గా బదిలీ చేశారు. తన బాధ్యతలను ఆయన నాలుగో అదనపు జిల్లా జడ్జి, స్పెషల్ కోర్టు ఫర్ ట్రెయిల్ ఆఫ్ అఫెన్స్ అగనెస్ట్ ఉమెన్, అనంతపురానికి అప్పగించాలి. మొదటి అడిషనల్ జడ్జి ఎస్. రమేష్‌ను చిత్తూరు మొదటి అడిషనల్ జడ్జిగా బదిలీ చేశారు. వీరు అనంతపురం లేబర్ కోర్టు చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించి, రిలీవ్ కావాలి. నాల్గో అడిషనల్ జిల్లా జడ్జి కబర్దీని నెల్లూరు ఒకటో అడిషనల్ జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. వీరు కూడా తమ బాధ్యతలను స్పెషల్ జడ్జి(పోక్సో)కి అప్పగించాలి. అలాగే కదిరి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావును విశాఖపట్నం రెండో అడిషనల్ సివిల్ జడ్జిగా, శ్రీకాకుళం జిల్లా టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరితను గుత్తి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

తోటల్లో అగ్గి పడితే పరిహారం వర్తించదు

- అనంతపురం జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథరెడ్డి సూచన

అనంతపురం అగ్రికల్చర్: అగ్నిప్రమాదాల వల్ల పండ్లతోటలు దెబ్బతింటే రైతులకు ఎలాంటి పరిహారం వర్తించదని ఉద్యాన రైతులను ఆ శాఖ అనంత జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డి హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రస్తుత రోజుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తోటల్లో కలుపు, ఎండుటాకులు, ఇతర గడ్డి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తోట చుట్టూ కంచెను, పరిసర పంట పొలాలను జాగ్రత్తగా గమనిస్తుండాలన్నారు. ఫారంపాండ్లు, కుంటల్లో నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక శాఖతో పాటు ఉద్యాన, రెవెన్యూ అధికారులకూ సమాచారం అందించాలని సూచించారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్‌కుమార్

హిందూపురం: హోంగార్డుల సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం హిందూపురానికి విచ్చేసిన ఆయనకు హిందూపురం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద హోంగార్డులు గౌరవ వందనం చేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పిదాలను సహించబోనని హెచ్చరించారు.

తల్లిమడుగులలో ఘర్షణ



చికిత్స పొందుతున్న నారాయణస్వామి

కనగానపల్లి: మండలంలోని తల్లిమడుగులలో బుధవారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్త నారాయణస్వామిపై టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ రామాంజినేయులు దాడికి పాల్పడ్డాడు. కనగానపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. తల్లిమడుగులలో రోడ్డు పక్కన దుకాణాల ఏర్పాటు విషయంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుందన్నారు. ఇరువర్గాల వారూ గాయపడ్డారన్నారు. ఘర్షణలో పాల్గొన్న ఇరు వర్గాలకు చెందిన 27 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పీఎం శ్రీ పథకానికి 'ఏపీఆర్ఎస్ఈ'



కొడిగెనహళ్లిలోని ఏపీ గురుకుల ప్రతిభావంతుల బాలుర పాఠశాల

పరిగి: ప్రభుత్వ బడులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర విద్యాశాఖ అమలుచేస్తున్న 'పీఎం శ్రీ స్కూల్స్' పథకానికి పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల ప్రతిభావంతుల బాలుర పాఠశాల (ఏపీఆర్ఎస్ఈ) ఎంపికైంది. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్ బాబు బుధవారం వెల్లడించారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా దేశీయంగా విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం... ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్ఆర్ఐ - పీఎం శ్రీ) పేరుతో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అత్యాధునిక హంగులు, సాంకేతికతను జోడించి డిజిటలైజేషన్‌తో నాణ్యమైన విద్యా బోధన అందించే దిశగా చేపట్టిన ఈ పథకానికి దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలలను తొలిదశలో ఎంపిక చేశారు. ఇందులో ఏపీలోని 662 పాఠశాలలు ఉండగా కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ఎస్ఈకు చోటు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఎంపికకు సహకరించిన సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ శ్రీను ప్రకాష్, గురుకుల సొసైటీ కార్యదర్శి నరసింహారావు, డీఈఓ మీనాక్షి, ఏఎంఓ మహేందర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మీదేవికి ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల భద్రతకు తొలి ప్రాధాన్యత

- కియా సీఏఓ కబ్డాంగ్ లీ



విపత్కర పరిస్థితుల్లో స్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలో కార్మికుల భద్రతకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆ పరిశ్రమ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏఓ) కబ్డాంగ్ లీ స్పష్టం చేశారు. పరిశ్రమలో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రత అనుభవ శిక్షణా కేంద్రాన్ని ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖరవర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరవర్మ మాట్లాడుతూ.. భద్రత అనుభవ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన కియా యాజమాన్యాన్ని అభినందించారు. రాష్ట్రంలోనే ఈ అభ్యసన కేంద్రం మొట్టమొదటిదని గుర్తు చేశారు. ఇతర పరిశ్రమల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చునన్నారు. కియా ఎండీ తే జిన్ పార్క్ మాట్లాడుతూ.. భద్రతా అనుభవ శిక్షణా కేంద్రంలో పరిశ్రమలోని చిన్న ఉద్యోగి మొదలు ఉన్నస్థాయి అధికారి వరకూ ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



మృతురాలు సుబ్బమ్మ

తాడిపత్రి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం ఆలూరుకు చెందిన తేరుకాటి తలారి సుబ్బమ్మ (64) మంగళవారం రాత్రి తన కుమారుడి ఇంటి వద్ద నిద్రించింది. బుధవారం ఉదయం నిద్ర లేచి తన ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో సుబ్బరాయుడి ఇంటికి వేసిన ఫెన్సింగ్‌ను పట్టుకుని నడిచేందుకు ప్రయత్నించింది. అయితే అప్పటికే కరెంట్ లైన్ తెగి ఫెన్సింగ్‌పై పడి విద్యుత్ ప్రసారం జరుగుతుండడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి కరెంట్ సరఫరాను నిలుపుదల చేయించారు. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కసాపురం ఆంజనేయస్వామి ఆలయ పాలక వర్గం ఏర్పాటు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ పాలకవర్గాన్ని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు కొనసాగే పాలక వర్గంలో చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త కె.సుగుణమ్మ వ్యవహరించనున్నారు. సభ్యులుగా టీవీ లోక్‌నాథశర్మ, మంతాజీ త్యాగరాజు, పాటిల్ మల్లికార్జునరెడ్డి, గనపర సరోజ, గుంత రమేష్ బాబు, శోభాశారద, గోపా వెంకటేశులు, పాటిల్ రాధిక, గంతుల లక్ష్మి, గంతుల రామక్రిష్ణమ్మ నియమితులయ్యారు. ఎక్స్‌ఆఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు కొనసాగనున్నారు. భక్తుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన గత పాలకవర్గం సభ్యులనే మరోసారి కొనసాగించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి ఈసందర్భంగా పాలక వర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక ఆచూకీ తెలపండి



శిల్ప

శింగనమల: మండలంలోని కల్లుమడి గ్రామానికి చెందిన డి.శిల్ప ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడ లేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 93460 10558, 93460 10580కు సమాచారం అందించాలని కోరారు.

ఈ నెల 21 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

ధర్మవరం రూరల్: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ ధర్మవరంలో సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ జిల్లా కార్యదర్శి బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చే క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

కొత్తచెరువు: పొలానికి వేసిన కంచెను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి టీడీపీ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను కొత్తచెరువు ఎస్ఐ లింగన్న బుధవారం వెల్లడించారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన ఇంజెం మురళికి పెనుకొండ రహదారిలోని తిప్పాబట్లపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే 71/1లో 14.16 ఎకరాల పొలం ఉంది. తన పొలం చుట్టూ రాళ్ల పాతి కంచెను ఏర్పాటు చేశాడు. అయితే ఈ పొలానికి సంబంధించి తాము కూడా అగ్రిమెంట్ చేసుకున్నామని దౌర్జన్యంగా టీడీపీ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, అనుచరుడు మాయల సాయి ఈ నెల 15న కంచెను ధ్వంసం చేశారు. దీనిపై బాధిత రైతు మురళి ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు, సాయిపై కేసు నమదో చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలి

- గత ఏడాది కనిపించకుండా పోయిన రైతు
- విద్యుత్ షాక్‌తో మృతి చెందితే గుట్టుచప్పుడు కాకుండా ఖననం
- హత్య కేసు కింద నిందితుల అరెస్ట్



మృతుడు షేక్ బాబ్జాన్

హిందూపురం: ఏడాది క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి ఆచూకీని పోలీసులు పసిగట్టారు. ప్రమాదవశాత్తు మృతిచెందితే గుట్టుచప్పుడు కాకుండా పాతిపెట్టేశారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను హిందూపురం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ కృష్ణారెడ్డి బుధవారం వెల్లడించారు. హిందూపురం మండలం చలివెందులకు చెందిన షేక్ బాబ్జాన్, రజియా దంపతులు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది జనవరి 26న పొలం పనుల ముగించుకుని సాయంత్రం ఇంటికి బయల్దేరిన బాబ్జాన్ (45)... అదే గ్రామానికి చెందిన రైతు ముర్తప్ప పొలం వద్ద అడవి పందుల వేటగాళ్లు చాకలి కిష్టప్ప, గొల్ల శ్రీరాములు, కిష్టప్ప అక్రమంగా వేసిన కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటి తర్వాత అడవి పందులు పడ్డాయోమోనని చూసేందుకు అటుగా చేరుకున్న వేటగాళ్లు... బాబ్జాన్ మృతదేహాన్ని చూసి భయపడ్డారు. ఈ విషయం వెలుగు చూస్తే ఆ నేరం తమ మీదకు వస్తుందనే అపోహతో ఎవరికీ చెప్పకుండా ఆటో డ్రైవర్ నరేష్‌ను రప్పించుకుని, అతని ఆటోలో బాబ్జాన్ మృతదేహాన్ని హంద్రీనీవా కాలువ వద్దకు తరలించి, పాతిపెట్టారు. కాగా, తన భర్త కనిపించకుండా పోవడంతో రజియా పలు ప్రాంతాల్లో గాలించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి బాబ్జాన్ ఆచూకీ కోసం ఆరా తీస్తూ ఉన్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం శ్రీరాములు ఫుల్‌గా మద్యం తాగి మత్తులో బాబ్జాన్ చనిపోయాడని, హంద్రీనీవా కాలువ వద్ద పాతిపెట్టినట్లు నోరు జారాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో శ్రీరాములును బుధవారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో మిగిలిన ఇద్దరు వేటగాళ్లనూ అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రికి ఆటో డ్రైవర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఔను.. అది హత్యే!

- హతుడు జొన్నగిరి వాసి శంకర్‌నాయక్
- రైలుపట్టాలపై వేసి ఆత్మహత్యగా చిత్రీకరించేయత్నం
- గొంత కోసి హతమార్చిన వైనం
- వివాహేతర సంబంధం, వడ్డీ వ్యాపారమే కారణం



రైలు పట్టాలపై పడి ఉన్న శంకర్‌నాయక్ మృతదేహం (ఫైల్)

పామిడి: ఈ నెల 10న స్థానిక రైలు పట్టాలపై వ్యక్తి మొండెం లభ్యమైన కేసులో మిస్టరీ వీడింది. ఇది ఆత్మహత్య కాదని, హత్యగా పోలీసులు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ఇద్దరిని పామిడి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గుత్తి రైల్వే పోలీసులు సంయుక్తంగా విచారణ చేస్తున్నారు.

ఏం జరిగింది?

ఈ నెల 10వ తేదీన పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డు రైల్వేగేట్ ఎల్‌సీ 143 సమీపంలో ఓ వ్యక్తి మొండెం లభ్యమైంది. తల లేదు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి హత్యగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కింద గుత్తి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పామిడి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గుంతకల్లు రైల్వే సీఐ నగేష్‌బాబు నేతృత్వంలో ముమ్మర దర్యాప్తు సాగించిన జీఆర్పీ సిబ్బంది.. ఈ కేసులో మిస్టరీని ఛేదించారు.

హతుడు ఎవరు?

తొలుత పట్టాలపై తలలేని మొండెం లభ్యం కావడంతో ఈ కేసు దర్యాప్తు రైల్వే పోలీసులకు పెను సవాల్‌గా మారింది. జీఆర్పీ సీఐ నగేష్‌బాబు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు కొనసాగించారు. మొండాన్ని కొద్ది దూరం వరకూ లాక్కొచ్చి అక్కడ పడేసినట్లుగా ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి... దర్యాప్తులో కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన శంకర్‌నాయక్‌గా నిర్ధారించారు.

ఎందుకు హతమార్చారు?

శంకర్‌నాయక్ వడ్డీ వ్యాపారం సాగించేవాడిగా తెలుస్తోంది. ఈ క్రమంలో వడ్డీకి ఇచ్చిన డబ్బు తిరిగి చెల్లించని ఓ మహిళను లోబర్చుకుని తన శారీరక అవసరాలు తీర్చుకునేవాడు. ఈ విషయం శంకర్‌నాయక్ భార్యకు తెలిసి గొడవ చేయడంతో సదరు మహిళ తన పుట్టింటికి చేరుకుంది. అయినా శంకర్‌నాయక్ ఆమెను డబ్బు కోసం వేధిస్తూ వచ్చాడు. ఇదే అతని హత్యకు దారి తీసింది.

ఎలా చేశారు?

పామిడి మండలం రామగిరి గ్రామానికి చెందిన మంగల నారాయణ, నారాయణమ్మ దంపతుల రెండో కుమార్తె రాజేశ్వరి అలియాస్ రాజీని పదేళ్ల క్రితం జొన్నగిరికి చెందిన కేశవయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా కేశవయ్య మృతి చెందాడు. ఆ సమయంలో కుటుంబ పోషణ భారం కావడంతో శంకర్‌నాయక్ వద్ద లక్ష రూపాయలను అప్పుగా రాజీ తీసుకుంది. ఈ అప్పు వసూలు చేసుకునే క్రమంలో ఆమెను శంకర్ నాయక్ లోబర్చుకుని శారీరక అవసరాలు తీర్చుకునేవాడు. ఏడాది క్రితం ఈ విషయం తెలుసుకున్న శంకర్‌నాయక్ కుటుంబసభ్యులు నిలదీయడంతో రాజీ ఆ గ్రామాన్ని విడిచి పుట్టింటికి చేరుకుని, వితంతువైన తన తల్లితో కలసి జీవిస్తోంది. అయితే అప్పు పేరుతో ఆమెను శంకర్‌నాయక్ వెన్నాడడం వీడలేదు. తరచూ రామగిరికి వచ్చి రాజీని కలసి డబ్బు గురించి నిలదీస్తూ తన అవసరాలు తీర్చుకుని వెళ్లేవాడు. చివరకు శంకర్‌నాయక్ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో ఎలాగైనా అతన్ని అడ్డుతొలగించుకోవాలని రాజీ, ఆమె తల్లి భావించారు. బాకీ డబ్బు ఇస్తామంటూ నమ్మించి శంకర్‌నాయక్‌ను రామగిరికి రప్పించిన రాజీ.. అనంతరం తన తల్లి నారాయణమ్మ సాయంతో ఈలకత్తి, కత్తులతో శంకర్‌నాయక్ గొంతుకోసి హతమార్చింది. అనంతరం మృతదేహాన్ని తీసుకువచ్చి పట్టాలపై పడేసి వెళ్లారు. పక్కా ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే శంకర్ నాయక్ తల ఎక్కడుందనేది స్పష్టత రాలేదు. గొంతు కోసిన తర్వాత తల కొంచెం మొండెనికి అతుక్కొని ఉండగానే రైలు పట్టాలపై పడేసినట్లు పోలీసుల విచారణలో రాజీ తెలిపినట్లు సమాచారం. మాయమైన తల కోసం పోలీసులు గాలిస్తున్నారు.